# దయ

అతని పేరేమిటో ఎవరికీ తెలీదు. 'తాత' అని పిల్చేవాళ్ళందరూ. ఎక్కడో లోతుకు కూరుకుపోయిన చిన్న కళ్ళు వార్థక్యం మూలాన వంగిపోయిన మెడ. పొడుగాటి తెల్లటి గడ్డం దట్టమైన కనుబొమలు. గరుడ ముక్కు. తలపాగా చుట్టుకొనేవాడు. ఒక చేత్తో వో డబ్బా పుచ్చుకొని, మరో చేత్తో బుజంమీద వేసుకున్న గోనెసంచీలో వస్తువుల్ని జాగ్రత్తగా పట్టుకుని, ఒక్కొక్క అడుగు వేసుకుంటూ "మరమరాలు, వేడివేడి మరమరాలు; శెనగపప్పు, ఒకటో నంబరు తాజా సెనగపప్పు; వేపుశనగకాయలు, వేపిన వేరుశెనగకాయలు. బటానీలు. కాలక్షేపం బటానీలు." అంటూ పెద్దగా కీచుగా అర్చుకొంటూ వీధుల్లో తిరుగుతూ జీవనంచేసుకునేవాడు. అతను ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడేవాడుకాదు. ఒక్కమాట అధికంగా మాట్లాడినా ఒక అణాబేరం పోతే? అతని కళ్లు ఏ భావాన్నీ తెల్పేవికావు. అతని పొడుగాటిగడ్డం దయనీయమైన జీవిత చరిత్రను తనలో దాచుకొని వుందన్న భ్రాంతిని కల్గజేసేది.

వేసవికాలం వచ్చేసిన సూచనగా మొక్కలు తలలు వేలాడేశాయి. గోదావరి మధ్యనున్న ఇసుక దిబ్బలు పైకి తేలాయి. పంపుల్లో నుంచి గుడగుడ శబ్దమేకాని నీళ్ళు బయటకి రావడంలేదు. మధ్యాహ్నంపూట మనుష్యప్రాణి రాజమండ్రీ వీధుల్లో కనిపించడం లేదు. 'తాత' మరమరాలు తదితర సామగ్రీ వెంట తీసుకుని మామూలుకు భిన్నం లేకుండా ఒక్కొక్క పేటే అర్చుకుంటూ తిరుగుతున్నాడు. పాలకోవా వాణ్ణీ, అయిసుక్రీం వాణ్ని చూసి ఈర్ష్య పడుతున్నాడు. సీతంపేట రామాలయం దగ్గర కాసేపు విశ్రాంతి తీసుకుని ప్రక్క సందులోకి తిరిగాడు.

"మరమరాలు, మరమరాలు ... వేరు శెనక్కాయలు .. బటానీలు.."

రాజ్యలక్షమ్మ పిల్లవాడికి ఒక్కొక్కమాటే చెబుతూ ఆ కేక విన్నది.

"వల. తల, అల, కల, పలక, పిలక, అరటి, అరటి పిలక"

"మరమరాలు, మరమరాలు.... వేరుశెనక్కాయలు... బటానీలు...."

"అమ్మా! అమ్మా! బఠానీలు కొనిపెత్తవ్?"

"అట్లాగే తండ్రీ!"

పిల్లవాణ్ణి ముద్దు పెట్టుకుని, రాజ్యలక్షమ్మ వరండాలోకి వచ్చింది. మరమరాల తాత అప్పుడే వీధి గుమ్మం ప్రక్కగా వెళ్ళిపోతున్నాడు.

"ఓయ్ తాతా! ఇటు, ఇట్రా!"

లోపలికి వస్తూనే తాత గుమ్మం ప్రక్కగా చెప్పులు విడిచి, బుజానవున్న గోనెసంచీ క్రింద పెట్టాడు. ఆ ప్రక్కనే డబ్బాపెట్టి. తల పాగా తీసి వొళ్ళో వుంచుకొన్నాడు. గోదావరి మీదనుంచి వస్తోన్న చల్లనిగాలి బట్టతలకు తగిలి ప్రాణం లేచి వచ్చినట్లనిపిస్తున్నది.

కుడిచేత్తో బట్టతలమీద ఆణిముత్యాల్లా మెరుస్తోన్న చెమట బిందువుల్ని తుడుచుకొంటూ, "కాసిని మంచితీర్థం ఇప్పించి, పుణ్యం కట్టుకో తల్లీ!" అన్నాడు నమ్రతగా.

రాజ్యలక్షమ్మ తల ఎత్తి, ఆ ముసలివాడివేపు చూసింది. వెతికి చూద్దామన్నా ఒక్క వెంట్రుకఅయినా కన్పించకుండా అద్దంలా మెరుస్తోన్న నున్నని బట్టతల. గడ్డంలోవున్న బలిమిని దాచేస్తూ పెరిగిన తెల్లటి పొడుగాటి గడ్డం. ఆమెకు నవ్వు వచ్చింది కాని, బలవంతంమీద ఆపుకొంది. కుర్రవాడు బటానీల సంచీ దగ్గరకు చేరి ఆత్రుసలో వున్నాడు!

ఆమెకు తాతను చూస్తే జాలి కల్గింది. అంత వయసులో కూడా జీవనతాపత్రయం తప్పక పోవడం! కొంత వయసంటూ వచ్చినతర్వాత

విశ్రాంతి అనుభవించలేకపోతే ఇహ ఆజీవికి నరకమే. మాట్లాడినప్పుడు అతని పెదిమలు తడి ఆరిపోయినట్లు ఆమెకు కనిపించాయి. ఆ కారణంగా "మంచి నీళ్లెందుకు తాతా ? మజ్జిగఇస్తాను పుచ్చుకొంటావా ?" అన్నది ఎంతో సానుభూతితో.

తాత తలాడించాడు. రాజ్యలక్షమ్మ తెచ్చి యిచ్చిన మజ్జిగ తాగి, స్థిమితపడి ఆసంగతీ ఈసంగతీ చెప్పాడు. అతను పుట్టేసరికి ఈ ఇర వయ్యో శతాబ్దం మొదలు కాలేదు. తన కళ్ళముందే భార్య చనిపోయింది. చేతి కందివచ్చారనుకొన్న కొడుకు లిద్దరూ తమ పెళ్ళాల కొంగుపట్టుకుని దేశంమీదకు వెళ్ళిపోయారు. తన ఆతి గతీ ఆక్కర్లేదని ఉన్న ఆస్తికాస్తా కూతురు పెళ్ళికోసం అమ్మేస్తే, ఆకూతురి మొగుడు బ్రాకెట్లాడి ఉన్న దంతా పోగొట్టుకొని, పెళ్ళాముతనూ బ్రతకలేక ఎండ్రిన్ తాగి ప్రాణం తీసుకున్నాడు. వాడుపోయిన అర్నెల్లకే కూతురుకూడా కలరావచ్చి తనకు కాకుండా పోయింది. ఇహ తనొక్కడు బతికాడు. చావలేక, చావులాంటి జీవితా న్ననుభవిస్తూ.

మరమరాల తాత నిట్టూర్చి. "దేముడికి నా మీద దయ లేక పోయింది తల్లీ ?" అన్నాడు గద్గదికంగా. ఏం కావాలో తీసుకోండమ్మా! నాలుగు వీధులు తిరిగితేకాని నాలుగు డబ్బులు రావు. అసలును రేప టికి దాచి లాభం అంటూ ఏదైనా వస్తే ..."

"ఎంత మిగుల్తుంది తాతా ?"

ముందు పడేసిన మరమరాలు ఏరుకు తింటున్నాడు కుర్రవాడు. రాజ్యలక్ష్మమ్మ జాలిగుండె అడక్కుండా వుండలేకపోయింది. పైగా లోపల ఏదో ఉత్కంఠ.

"ఎంతొస్తుంది తల్లీ ? ము ప్పా వ లా వచ్చేను, తప్పితే ఓ రూపాయి."

రాజ్యలక్ష్మమ్మకు ఆశ్చర్యం వేసింది. ముప్పావలాతో ఎట్లా రోజు గడపడం? రాజ్యలక్ష్మమ్మ మొగుడు గవర్నమెంట్ కాలేజీలో గెజిటెడ్ లెక్చరర్‌గా వుంటున్నాడు. పైగా పుట్టింటి వారుకూడా ఇంత తినా కుడవా వున్నవారే.

మరమరాలు తాతే మళ్ళీ అంటున్నాడు. "ఆ రూపాయి డబ్బులు కూడా ఈ ఉన్న సరుకులో ఏ సగమున్నా అమ్ముడు పోతేనేతల్లీ! ఒక్కోరోజు ఆ బేరమూ వుండదు."

రాజ్యలక్ష్మమ్మ ఆలోచిస్తున్నది. కుర్రవాడి పుట్టిన రోజు పండగ వస్తున్నది. పైగా వాడ్ని బళ్ళో వేయాలి అనికూడా అనుకొంటున్నది. ఆ రోజు సంబరపడుతూ వచ్చిన నలుగురు పిల్లలకూ తాను ఏమైనా పెట్టాల్సిందేకదా? ఆ కొనే మరమరాలూ, సెనగపప్పూ ఈ తాతదగ్గిరే తీసుకోవచ్చుగా? ఆ ముసలి గుండెకూ కాస్త సాయం చేసినట్టు వుంటుంది. ఓ నిర్ణయానికి వచ్చిన సంతోషంలో "తాతా! డబ్బాలోనూ, సంచీలోనూ వున్న సరుకంతా ఎంత ఖరీదుంటుంది?" అని అడిగింది.

"పది రూపాయలెట్టి తెచ్చాను తల్లీ!" అన్నాడు తాత, ఆవిడ బేరం ముగింపు చెయ్యనందుకు లోలోపల బాధపడుతూ.

"అయితే నేను పన్నెండు రూపాయలిస్తాను. అన్నీ ఇక్కడి పోసెయ్!"

"ఏమిటి తల్లీ? ఈ ముసిలివాడితో హాస్యమాడుతున్నారా?

రాజ్యలక్ష్మమ్మకు అతన్ని నమ్మించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. పది రూపాయలనోటు ఒకటి, రెండు రూపాయలనోటు ఒకటి తీసుకునివచ్చి అతని చేతులో పెట్టి, "మా పిల్లవాణ్ణి బళ్ళో వేయాలనుకుంటున్నాం అయిదోఏడు రాగానే" అన్నది కుర్రవాణ్ణి దగ్గరకు తీసుకుంటూ.

డబ్బులు చేతులో పడ్డతర్వాత గాని ఆవిడ మంచితనం అతనికి తెలిసిరాలేదు. రెండు చేతులూ జోడించి నమస్కారం చేస్తూ, "వెయ్యేళ్ళు పిల్లా పాపా కలిగి సుఖంగా వుండు తల్లీ! దయగలతల్లివి! నీలాంటివాళ్ళు నూటికి కోటికి ఒక్కరుండరు." అన్నాడు గద్గదికంగా కళ్ళల్లో నీళ్ళతో.

రాజ్యలక్ష్మమ్మ లోపల్నుంచి తెచ్చి యిచ్చిన డబ్బాల్లో తన దగ్గరున్న వస్తువు లన్నింటినీ సర్దేశాడు. తేలిగ్గావున్న డబ్బాను ఎడమ చేతిలోకి పుచ్చుకున్నాడు. మజ్జిగ తాగినగ్లాసు కడిగి మండిగంమీద పెట్టాడు. తలపాగా సర్దుకున్నాడు.

చెప్పులు తొడుక్కుంటూ "వస్తా తల్లీ!" అని, ముందుకు రెండడుగులు వేసి మళ్ళీవెనక్కువచ్చి తల్లి చంకలోవున్న పిల్లవాణ్ణి బుగ్గలు పుణికి, "దొరబాబువు! ఎంత దొడ్డ బుద్ధి పుట్టించావో మా తల్లికి!" అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న అతన్ని వెనగ్గా చూస్తూ అనుకొన్నది రాజ్యలక్ష్మమ్మ. "ముసిలివాడు! ఇవాళైనా తింటాడు కడుపునిండా!"

ఒక వయసుదాటిన వాళ్ళల్లో సంతోషం పరవళ్ళు త్రొక్కుతూ బయటికి పొంగదు. సంతోషాన్ని ఎట్లా బహిర్గతం చేయాలా అని తాపీగా పూర్వాపరాలు ఆలోచించుకుంటారు వాళ్లు. మరమురాలతాతకు ఆలోచించుకోవటానికి మట్ట మధ్యాహ్నం, ఆ నగరంలో నడిబొడ్డు అంతగా తగిన ప్రదేశం కాదనిపించింది జేబులో రూపాయల కాగితాలు బరువుగా తగుల్తూ చక్కలిగింతలు పెడుతున్నట్లున్నాయి. వంగిపోయిన మెడ నిటారుగా నిలబడటానికి ప్రయత్నం చేస్తోంది. తన కష్టాలు కాస్సేపు మర్చిపోయాడు. ఠీవిగా నడుచుకొంటూ గొప్పవాళ్ళుగా చలామణీ అవుతున్నవాళ్ళకు ప్రత్యేకించిన ఓ హోటలుకి వెళ్ళాడు. అద్దంలా మెరుస్తోన్న వో టేబిలుముందు కూర్చున్నాడు.

ఒకళ్ళిద్దరు సర్వర్లు అతనివేపు ఎగతాళిగా చూశారు. ప్రొప్రయిటరు అతన్ని వెళ్ళిపొమ్మని హెచ్చరిద్దా మనుకున్నాడు.

కానీ అప్పటికే మరమరాలతాత 'స్వీట్స్'కి ఆర్డరివ్వడమూ, ఒకదాని తర్వాత ఒకటిగా, చెడుగుడాడుతున్నట్టుగా తినడమూ జరుగుతుండడంతో ఆ ప్రస్తావన విరమించుకున్నాడు.

జిలేబి, మొఖమల్ పూరీ, రవ్వలడ్డు, వెజిటబుల్ పలావు, ఊతప్పం.... కాఫీ తాగి, బిల్లు చేతబుచ్చుకుని కౌంటర్ దగ్గరకు వచ్చి, పది రూపాయల నోటు బయటకు తీసి, నిర్లక్ష్యంగా దాన్ని టేబిలుమీదకు గిరవాటువేసి, వచ్చిన చిల్లరను లెక్కపెట్టుకోకుండా గుప్పటితో తీసుకుని జేబులోకి వేసుకున్నాడు.

అతని మనస్సంతా తేలిపోతున్నట్టున్నది. ఎప్పుడో, తనకు రెండెకరాల కొంప్రద వున్నప్పుడు తను ఒకసారి బావమరిదితోకలిసి హోటలుకువెడితే వాడు పెట్టించాడు తనకు, ఇవ్వాళ తిన్నవాటిలో కొన్నింటిని. 'తాత' గడ్డం సవరించుకొన్నాడు. నరాలుమత్తుగా నిద్రపోతున్నట్టున్నాయి. "కాపుసారా ఓసీసావేస్తే? తస్సాదియ్య, మా రంజుగా వుంటది ..." రోజూ గంజినీళ్ళూ కాసింత వణ్ణమూ తినే గొర్రెబతుకులు తమవి. జల్సా జీవితంలోవున్న మజా తమ కేమీ తెల్సు? డబ్బున్న దొరలు ఎన్నిరకాలషోకిళ్ళు పోయినా. ఎన్నిరకాల తిళ్ళు తిన్నా అడిగే వాడు లేడు. ఆ షోకులకూ, తిండికీ ప్రత్యేకత కూడా లేదు.

బీదవాడుమాత్రం అందుకు అలవాటుపడ్డాడా ముకుదాడు వేసి గోతిలో పడవేసేదాకా ఇది వూరుకోలేదు. 'తాత' కడుపునిండా తిన్నాడు. కుత్తుకవరకూ తాగాడు. రోడ్డుమీద లిల్లాయిపదాలు పాడుకొంటూ అడ్డంగా వడుకున్నాడు. బీటుకానిస్టేబులు వచ్చి ఎదురుగ్గా నిలబడితే "యమధర్మరాజు భటుడివా? నాబావమరదివా?" అని అడిగాడు. యమధర్మరాజు భటుడు అతన్ని అటూ ఇటూ కుదిపి, ఆ జేబుల్లోమిగిలిన చిల్లరా రూపాయలనోట్లూ తీసుకుని తన దారిన తాను పోయాడు.

ఎండతగ్గి, చీకటిరాజ్యం రావటానికి ముందు వీధుల్లో నీడలు పొడుగయ్యే సమయానికిగాని మరమరాలతాత మనలోకంలోకి రాలేదు.

వచ్చింతర్వాత, అతనికి తనమీద తనకు కోపంరావటానికిబదులు రాజ్యలక్ష్మమ్మమీద కోపంవచ్చింది. ఆవిడ ఆదయ తనమీద చూపించక పోతే తనకీ అవమానం కలిగేదికాదుగదా? అనిపించింది. రోజూ ఏఅర్ధో ముప్పావలో వస్తే, అది తన గంజినీళ్ళకే సరిపోయేదికాదు. ఇవ్వాళ ఇంతడబ్బు కళ్ళబడేసరికి అంతవయసులో వుండికూడా తనో వెర్రి వెధవ అయ్యాడు! అయినా ఈ ధనికులందరూ ఇంతే! బీదవాళ్ళ కేవేవో ఆశలు చూపిస్తూ వుంటారు. తన జీవితాన్ని ఆ రాజ్యలక్ష్మమ్మే నాశనంచేసింది! దయ పేరుతోటి!! మంచితనం పేరుతోటి!!!

మళ్ళీ మరమరాల తాత సీతంపేటలో, రామాలయం ప్రక్క సందులోవున్న రాజ్యలక్ష్మమ్మ దగ్గరకు వెళ్లాడు. ఆవిడను బయటకు పిల్చి తనసోదంతా వెళ్ళబోసుకున్నాడు. అంతా చెప్పుకుని, చివరకు "మీరు.... మీరు ... మీరంతా రాక్షసులు" అన్నాడు పిడికిళ్లు బిగించి.

రాజ్యలక్ష్మమ్మ అతన్ని పిచ్చివా డనుకొంది.

"వెళ్లు, వెళ్ళు. ఇక్కడ గొడవచెయ్యకు." అన్నది కోపంగా.

తాతకు మరీ కోపం వచ్చింది. "ఎక్కడికని వెళ్ళను? ఇహ సరాసరి గోదాట్లోకి వెళ్ళాలి. నా జీవితాన్ని నాశనంచేసావ్? నా బ్రతుకునే బండల పాల్జేశావ్? ఎక్కడికి వెళ్ళను? ఎవ్వడు నాకు అప్పిస్తాడు రేపటినుంచీ నే నిహ వస్తే! ఆకలితో మాడి మాడి, నీపేరు చెప్పుకుని, నీ పిల్లవాడ్ని తలుచుకుని...."

"వద్దు....వద్దు .." రాజ్యలక్ష్మమ్మ పిల్లవాడని గుండెల కదుముకొంది.

మరమరాలతాత అరుపులువిని చుట్టుప్రక్కల కిటికీతలుపులు తెరుచుకున్నాయి. రాజ్యలక్ష్మమ్మ మొగుడు క్లబ్బునుంచి తిరిగివచ్చే

వేళయింది. ఇంటిముందు ఏవిధమైనగొడవ జరగడమూ అతనికి ఇష్టముండదు. ప్రిస్టేజీకి భంగ మంటాడు. రాజ్యలక్ష్మమ్మను సాధిస్తాడు ఇంట్లో, అటువంటి పొరపాటు జరిగినప్పుడల్లా. తాత ఇంకా గొంతు పెద్దది చేస్తున్నాడు. "నామీద దయ చూపించేవేం! నిన్నెవడు కొన మన్నాడు? అసలు నాది బుద్ధితక్కువ. నీకసలు నాసరుకంతా ఎవ డమ్మ మన్నాడు! ఆసరుకు నాదగ్గరేవుంటే, రోజూ, అది అర్ధో పావలో నాకు సంపాయించి పెడుతుంటే, ఈ తిప్పలు నాకు రాకపోనుగదా? నేనూ వెధవను, వెర్రివెధవను, ముమ్మాటికీ వెర్రివెధవను, అవును మేం బీద వాళ్ళం మేమంతా వెర్రివెధవలమే! నువ్వే తెలివిగలదానివి! డబ్బున్న మీ జాతే తెలివిగలజాతి. నువ్వూ! నీ మొగుడూ, నీ కుఱ్ఱవాడు అందరూ.........అందరూ...." మాట పూర్తిచేయలేక పెడీ పెడీమని లెంపలు వాయించుకోవడం మొదలుపెట్టాడు.

రాజ్యలక్ష్మమ్మ ఇంట్లోకి పరుగెత్తింది. మరమరాలూ, శనగ పప్పూ, బిటానీలూ, వేరుశనగకాయలూ అన్నీతెచ్చి, అతనికి ఎదురుగ్గా పెట్టి "తీసుకో ఇవన్నీ తీసుకో! అరవకుండామాత్రం వెళ్ళు! అరిస్తే వూరుకోను. ఇవిగో నీసరుకులు. నా డబ్బు నాకు అక్కర్లేదు. వెళ్ళు. ఊ ఊఁ! తొందరగా!!" అన్నది.

మరమరాలతాత తన పొడుగాటిగడ్డాన్ని సవరించుకున్నాడు. అబగా ఆవస్తువులన్నిటినీ సంచిలోనూ, డబ్బాలోనూ సర్దుకున్నాడు. ఆతర్వాత "మూఁ ఎత్తి, దయగల ఇల్లాలు, కొడుకులూ, కూతుళ్ళూ కలిగి వెయ్యేళ్ళు లక్షణంగా వుండు తల్లీ!" అంటూ ఆశీర్వదించాడు.

దయగల ఇల్లాలు రాజ్యలక్ష్మమ్మ, శూన్యదృక్కుల్తో, కొడుకును గుండెలకు అదుముకొంటూ అతనిపేపే చూస్తూన్నట్లుండిపోయింది.

*   *   *